
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0, కనిష్ఠం 25.7
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
బుధవారం 3 జూలై 2024





- బీజేపీని వీడేందుకు సిద్ధమైన మాజీ ఎంపీ సోయం బాపురావ్
- ఎంపీ టికెట్ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి
- పార్టీ కార్యక్రమాలకు దూరంగానే సోయం
- త్వరలోనే రాజీనామాపై నిర్ణయం తీసుకునే అవకాశం

బీజేపీకి

సోయం రాజీనామా?



ఆదిలాబాద్,జూలై2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యమ నాయకుడిగా పేరున్న మాజీ ఎంపీ సోయంబాపురావు బీజేపీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ టికెట్ కోసం చివరివరకు ప్రయత్నాలు చేసిన అవకాశం దక్కక పోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తనను కాదని కొత్తగా పార్టీలో చేరిన గోడంనగేష్‌కు టికెట్ ఇవ్వడం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో లోక్‌సభ ఎన్నికలకు ముందే పార్టీని వీడేందుకు సోయం సిద్ధమైన కేంద్ర అధిష్ఠానం పెద్దలు రంగంలోకి దిగి బుజ్జగించడంతో వెనుకడుగు వేశారు. అయిన గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఇటీవలే కేంద్ర మంత్రి బండి సంజయ్, ఇతర మంత్రులను కలిసి తన రాజకీయ భవిష్యత్తు పై చర్చించినట్లు తెలుస్తుంది. పార్టీ పెద్దల నుంచి ఎలాంటి హామీ దక్కక పోవడంతో చివరకు కమలం పార్టీతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది. త్వరలోనే అనుచరులతో సమావేశమై తన రాజీనామా పై ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే బీజేపీకి జిల్లాలో కొంత ఇబ్బందికరమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సోయం అధికార పార్టీ వైపు అడుగులు వేసే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తుంది.

• సోయం నారాజ్

లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ఎంపీ సోయంబాపురావ్‌కు టికెట్ ఇవ్వక పోవడంపై బీజేపీ అధిష్ఠానం ఇప్పటి వరకు స్పష్టత ఇచ్చినట్లు కనిపించడం లేదు. ఎలాంటి కారణం చెప్పకుండానే సిట్టింగ్ ఎంపీని పక్కన పెట్టి వలస నేతకు అవకాశం ఇవ్వడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో మునుపెన్నడు లేని విధంగా 2019 ఎన్నికల్లో సోయం విజయం సాధించారు. దీంతో బీజేపీ ఆదిలాబాద్ లోకసభ స్థానాన్ని తొలిసారిగా తన ఖాతాల్లో వేసుకుంది. అప్పటి వరకు బీజేపీ అభ్యర్థులెవరికి డిపాజిట్లు దక్కిన దాఖలాలు లేవు. ఆదివాసీల్లో మంచి పట్టున్న సోయం గత ఎన్నికల్లో గణ విజయం సాధించారు. అప్పటి నుంచే బీజేపీ ఉమ్మడి జిల్లాలో మరింత బలపడుతు వచ్చింది. సోయం గెలిచిన తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోను పలు జడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీటీసీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. ఇలా వరుస ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని ఆధిక్యతను చాటుతూ వస్తోంది. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ అసెంబ్లీ నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన సోయం ఓటమి పాలయ్యారు. అయితే సోయంకు లోక్‌సభ ఎన్నికల్లో అవకాశం దక్కకపోవడంపై ఆయన తీవ్రఅసంతృప్తికి గురై పార్టీకి దూరంగానే ఉంటూ వస్తున్నారు. పార్టీలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఆయనకు వ్యతిరేకంగా పనిచేయడంతోనే లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ రాలేదంటూ సోయం బహిరంగంగానే ఆరోపించారు.

• త్వరలోనే రాజీనామా?

మాజీ ఎంపీ సోయంబాపురావ్ త్వరలోనే బీజేపీ పార్టీకి రాజీనామా చేసే అవకాశం కనిపిస్తుంది. గత కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న సోయం కమలం పార్టీతో తెగతెంపులు చేసుకునేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది. పార్టీలో సరైన ప్రాధాన్యత లేక పోవడంతోనే ఆయన రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేక పోయిన తన రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన బీజేపీని వీడాలని ఆయనపై అనుచరులు ఒత్తిళ్లు చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే మోదీ జిల్లాకు వచ్చిన సందర్భంలోనూ సోయంకు సరైన ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించలేదు. బహిరంగ సభవేదికపై ప్రధానికి సోయం సన్మానం చేసేందుకు ప్రయత్నించగా ప్రధాని భద్రత సిబ్బంది అడ్డుకోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలకు ముందు పార్టీ అధిష్ఠానం పెద్దలు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నివాసంలో సమావేశమై సోయంకు జాతీయస్థాయిలో నామినెట్ పదవిని ఇచ్చేందుకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో సోయం లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారంచేశారు. తర్వాత పార్టీ ఆ విషయాన్ని పక్కన పెట్టడంతో సోయం మళ్లీ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

పార్టీని వీడాలని కార్యకర్తలు ఒత్తిడి చేస్తున్నారు..

• సోయంబాపురావ్ (మాజీ ఎంపీ, ఆదిలాబాద్)

బీజేపీకి రాజీనామా చేసే విషయమై త్వరలోనే కార్యకర్తలతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటా. కొంతకాలంగా పార్టీని వీడాలని కార్యకర్తలు ఒత్తిడి చేస్తున్నారు. ఎలాంటి కారణం చెప్పకుండా పార్టీ అధిష్ఠానం టికెట్ ఇవ్వకపోవడం బాధాకరం. ఆదివాసీ నేత ను కావడంతోనే పార్టీలో చిన్నచూపు చూస్తున్నారు. ఆ దివాసీల కోసం న్యాయ పోరాటం చేయడం తప్పేలా అవుతుంది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తనపై కక్ష్యగట్టి ఎదగకుండా చేస్తున్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటా.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

భూ నిర్వాసితులకు అటవీశాఖ తరపున

ఎకరం చొప్పున భూమిని ఇస్తాం

• ఆర్డీవో వినోద్‌కుమార్

ఇచ్చోడ, జూలై 2: అటవీ శాఖ తరపున భూ నిర్వాసితులకు ఎకరం చొప్పున భూమిని అందజేస్తామని ఆర్డీవో వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని కేశవపట్నం గ్రామస్థులతో ఆర్డీవో వినోద్‌కుమార్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబ్జీపేట్ అటవీ పరిధిలో భూ ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ జీవనమార్గాలు కల్పించడం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని అన్నారు. అటవీ శాఖ అధికారులు పలుమార్లు గ్రామస్థులతో చర్చలు జరిపినా కేశవపట్నం, గుండాల గ్రామస్థులు అధికారుల మాటలు లెక్కచేయకుండా పదేపదే అటవీ భూముల్లో నాటుతున్న మొక్కలను ధ్వంసం చేస్తున్నారని, ఇది మానుకోవాలని కోరారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో భూ నిర్వాసితులకు ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున భూమిని అటవీశాఖ అందిస్తుందని పేర్కొన్నారు. దీన్నిగ్రామస్థులు ఒప్పుకోకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో గణేష్, ఎంఆర్వో తుకారాం, సీఐ భీమేష్, డిప్యూటీ ఎఫ్ఆర్వో గీరయ్య, ఎస్సై నరేష్, అటవీశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.




విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న ప్రణీత

నాణ్యమైన విద్య అందించాలి

• జిల్లా విద్యా శాఖాధికారి ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, జూలై2: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా విద్యా శాఖాధికారి ప్రణీత అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల యూనిఫాం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాయణ హై స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల ఫీజు వివరాలు, ఉపాధ్యాయులు విద్యార్హత గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు.



ఈదురు గాలులకు విద్యుత్ తీగలపై పడిన చెట్లు

బజార్‌హత్నూర్‌లో గాలివాన బీభత్సం

బజార్‌హత్నూర్, జూలై2: మండలంలోని మంగళవారం సాయంత్రం తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. భారీ చెట్లు నేలకొరిగాయి. పిప్రిలో రహదారి పక్కనే ఉన్న చెట్టు ఈదురు గాలులకు విరిగికరెంటు స్తంభంపై పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. స్థానికంగా ఉండాల్సి జేఎల్ఎం వేరే మండలంలో నివాసం ఉంటున్నారని, అత్యవసర సమయంలో పిప్రిలో చెందిన ప్రైవేటువ్యక్తితో పనులు చేయించుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. సదరు అధికారి స్థానికంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

సంక్షిప్త సమాచారం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఇంద్రవెల్లి, జూలై 2: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. మంగవారం మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో పోలీసులు తనిఖీ చేయగా 3320 గుట్కా ప్యాకెట్లు లభించడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడిహత్నూర్ తైబజార్ వేలం

గుడిహత్నూర్, జూలై2: పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. వేలం పాటలో ఐదుగురు వ్యక్తులు పాల్గొనగా మండల కేంద్రానికి చెందిన ఆడే సునీల్‌కుమార్ రూ.3లక్షల 40వేలకు పాడి తైబజార్ వేలాన్ని దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీడీవో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి అబ్దుల్ హై, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, కారోబార్ అమీన్ అలీ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సిరికొండ, జూలై 2: సిరికొండ మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హజరుకావాలన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

ఇంద్రవెల్లి, జూలై2: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఉట్నూర్ సీఐ మొగిలి కోరారు. మంగళవారం ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలోని దుర్వగూడ గ్రామంలో సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలు సృష్టించుకుని ఇబ్బందులకు గురికావద్దని ప్రజలకు సూచించారు. చోరీలు, సైబర్ క్రైమ్‌లతో అప్రమత్తంగా ఉండాలని, నేరాల అదుపునకు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించాలని చూసినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మొగిలి

తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలి

• ఎమ్మెల్యే పాయల శంకర్ • బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



• విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 2: పిల్లల మంచి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పిస్తున్నారని, వారిఆశలను వమ్ము చేయకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాయలశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం శాంతినగర్‌లోని బీసీ బాలుర వసతి గృహాన్ని అకస్మీకంగా సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, నోట్ బుక్కులు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో భోజనం, ఇతర వస్తువులు సక్రమంగానే ఉన్నాయని ఎలాంటి సమస్యలు లేవని విద్యార్థులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. హాస్టల్ గదులు, వంట గదిని ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ చిన్నప్పుడు తాను హాస్టల్లో విద్యార్థుల కష్టాలు చూశానని, ఇప్పుడు పరిస్థితులు మారినందున వసతి గృహాలవైపు దృష్టి సారిస్తున్నారని అన్నారు. పిల్లలు అంతా బాగా చదువుకోవాలని సూచించారు. కార్య క్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి షైనర్ల శివకు మార్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఆకుల ప్రవీణ్, కేశవ్, రాజు, షిండే పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సాయన్న

ఇంద్రవెల్లి, జూలై2: గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ సాయన్న ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, మురుగు కాలువలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ వేయడం, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్,చ ఎంపీవో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

డివిజన్‌స్థాయి ఫొటో, వీడియో గ్రాఫర్ల సమావేశం

ఇచ్చోడ, జూలై 2: మండల కేంద్రంలో మంగళవారం డివిజన్‌స్థాయి ఫొటో, వీడియో గ్రాఫర్ల సమావేశం నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దోడ అశోక్ తెలిపారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని ఫొటోగ్రాఫర్లు తమ సృజానాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. క్యాక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ఇచ్చోడ, నేరడిగొండ, గుడిహత్నూర్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

• మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, జూలై2: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తి అవుతున్న ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ హామీని అమలు చేయలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం, 4వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతమందికి సాయం చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ ఫొటో ఉందని చెప్పి పాఠ్యపుస్తకాలు పంపిణీ నిలిపి వేశారన్నారు. పక్కరాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి గురువు అక్కడి సీఎం చంద్రబాబు జగన్ ఫొటో ఉన్నా పుస్తకాలను పంపిణీ చేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి కేవలం ఢిల్లీ పర్యటనలకే పరిమితవుతున్నారని విమర్శించారు.




సమావేశంలో మాట్లాడుతున్న జోగు రామన్న

'దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలకు ఇవ్వాలి'

ఆదిలాబాద్‌అర్బన్, జూలై 2: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు పెంచుతామన్న రూ.6వేల పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కళ్లెపల్లి ప్రేమ్ రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతీనెల రూ.6వేల పెన్షన్ అందజేయాలని అన్నారు. దివ్యాంగుల సమస్యలపై ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.






మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ


పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

అన్నిశాఖల సమన్వయంతో

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి

● కలెక్టర్ రాజార్షిషా ● గంజాయి విక్రయదారుల వలలో రైతులు పడొద్దు : జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూలై2: జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్, రెవెన్యూ, అగ్రికల్చరల్, పోలీసు, వివిధ శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, పడించడం, రవాణాపై తీసుకోవాలని నిర్ణయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలలో ఆంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులలో మత్తు పదార్థాలపై, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహనను కల్పించాలని సూచించారు. ప్రతి ఆంటీ డ్రగ్ కమిటీలలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాస్టల్లో ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తూ తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 35 కేసులను 111 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 67 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఇప్పటి వరకు42 మంది గంజాయి విక్రయదారుల పై బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి వినియోగదారులకు కౌన్సిలింగ్‌కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.సమాజంలో, విద్యాసంస్థలు, మత్తు పదార్థాలపై ఎటువంటి సమాచారం ఉన్న పోలీసు అధికారులకు సూచించాలని తెలిపారు. గంజాయి విక్రయదారుల ఆశలో పడి రైతులు గంజాయిని పండించినట్లయితే ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధి చేకూరదని, కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహారాష్ట్రతో సరిహద్దుతో ఉన్నందున రైలు, రోడ్డు మార్గాలలో గంజాయి విక్రయదారులు ప్రయాణిస్తున్నట్లు, చిన్న మొత్తంలో ఆదిలాబాద్ పట్టణంలోకి గంజాయిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వాటిని అడ్డుకునేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళల అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తూ అడ్డుకుంటుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్నిపోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు చైతన్య పరచడం జరుగుతుందన్నారు. అత్యధికంగా గంజాయి వినియోగిస్తున్న వారికి డిఅడిక్షన్ సెంటర్లకు సిఫారసు చేసి వైద్యం అందించాలని సూచించారు. సమాజంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి కార్యక్రమాలపై, వారి దినసరి చర్యపై పరిశీలిస్తూ ఉండాలని తెలపారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో 124 కేజీల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చడం జరిగిందని తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి ప్రశాంత్‌బాజీరావుపాటిల్, ఆర్డీఓ వినోద్‌కుమార్, స్త్రీ శిశు, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు సబిత, సునితకుమారి,డీఈఓ ప్రణీత, డీఐఈఓ రవీందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమాశ్రీ వ్యవసాయ అధికారి రమేష్, తదితరులు ఉన్నారు.

'నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 2: నాయీబ్రాహ్మణ సంఘంతోపాటు సభ్యుల అభ్యున్నతికి కార్యవర్గం పనిచేయాలని నాయిబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాంకుమార్ అన్నారు. గతంలో పట్టణ సంఘం ఎన్నికలు జరుగగా సంవత్సర కాలానికి రాములును, మూడు సంవత్సర కాలపరిమితి ఉన్న సంఘానికి రెండో అధ్యక్షుడిగా వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం బీసీ సంఘ భవనంలో నూతనంగా ఎన్నికైన వెంకటేశ్‌తోపాటు మాజీ అధ్యక్షున్ని సత్కరించారు. రానున్న రెండు సంవత్సరాల కాలం పాటు వెంకటేశ్ కొనసాగనున్నారని, సంఘ సభ్యులతోపాటు సంఘ బలోపేతం కోసం నూతన అధ్యక్షుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కలాల శ్రీనివాస్, నాయీబ్రహ్మణ అధ్యక్షుడు వేణుగోపాల్, రాము, మందపల్లి శ్రీనివాస్, నర్సన్న, శ్రీకాంత్, రాజు, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరుతున్న కొత్త ఉపాధ్యాయులు

ఉట్నూర్, జూలై 2: ప్రభుత్వం గత రెండు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు చేయడంతో కొత్త స్థానాలలో ఉపాధ్యాయులు విధుల్లో చేరుతున్నారు. ఉట్నూర్ మండలంలో 46 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 11 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు పని చేస్తుండగా 40మంది ఉపాధ్యాయులు మండల పరిధిలోని పాశాలల్లోనే బదిలీలు కాగా ఆదిలాబాద్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల నుంచి మరో 16 మంది ఉపాధ్యాయులు ఉట్నూర్ మండలానికి బదిలీ పై చేరుకున్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో విధుల్లో చేరినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

'త్వరలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ'


పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

తలమడుగు, జూలై 2: త్వరలోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అందనుందని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉండం, ఝరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. పదవుల కోసం టీఆర్ఎస్, బీజేపీ మాటలు ఎవరూ వద్ద నమ్మవద్దని కోరారు. అనంతరం గ్రామంలో రెండు లక్షల జెడ్పీ నిధులతో పూర్తి అయిన మైసమ్మ ముందు షెడ్‌ను ప్రారంభించి, ఝరి గ్రామంలో ఐదు లక్షల జెడ్పీ నిధుల నుంచి మంజూరు అయిన సవారి బంగ్లా షెడ్‌కు భూమిపూజ చేసి, అదే గ్రామానికి చెందిన సొసైటీ సీఈవో బొండ్ల భూమారెడ్డి పదవి విరమణ కావడంతో శాలువాతో సన్మానించారు. అదే గ్రామానికి చెందిన కుమ్ర ఆనంద్ సతీమణి బిడ్డకు జన్మనిచ్చి మరణించడంతో బిడ్డకు పాల కోసం రూ.5వేల ఆర్థిక సహాయం చేసి, అదే గ్రామానికి చెందిన సుంకరి నర్సయ్య ప్రమాదం జరగడంతో మెడికల్ ఖర్చులకు రూ.3వేల సహాయం చేశారు. ఆయనవెంట ఎంపీపీ కళ్యాణంలక్ష్మీ, రాజేశ్వర్, ఝరి సహకార సంఘం చైర్మన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, వాయిస్ ఎంపీపీ దివ్య మాధవ్, ఎంపీటీసీ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ. ప్రకాష్‌రావు, రాము, రఘు, రఫీక్, చల్ల దేవన్న, పోతన్న, రామచందర్ దేశ్‌ముఖ్, లక్ష్మన్న, మహేందర్, మోహన్‌రెడ్డి, శ్రీను, రాజు పాల్గొన్నారు.





'అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూలై2: అంగన్‌వాడీలకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలకు పెన్షన్ తక్కువ ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో 65వ సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10వేల మంది పనిచేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4వరకు 24 రోజులు అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారన్నారు. ఈ సమ్మె సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.1లక్ష పెంచుతామని, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగుల స్థితిగతులు, గత 24 రోజులు సమ్మె జరిగిన పరిస్థితి, సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి కూడా వివరంగా ప్రభుత్వం ఐసీడీఎస్ మంత్రి, ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకు వెళ్లినట్లు చెప్పారు. .రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ మనోభావాలను వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతితక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను జూలై 4 తర్వాత ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు.అంగన్‌వాడీ టీచర్స్‌కు నష్టం కలిగించే జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష పెంచుతూ కొత్త జీవోను జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత,జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ,నాయకులు డి.సునిత, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆదివాసీలు

ఘనంగా గోడెం రామారావ్ జయంతి

ఇచ్చోడ: ఆదివాసీ గిరిజనుల కోసం ఎనలేని సేవలు చేసిన గోడం రామారావ్ 92వ జయంతి వేడుకలను కుటుంబసభ్యులు, నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని పోలీస్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు మంత్రివర్గంలో పనిచేసిన ఆయన ఆ కాలంలో గిరిజనులకు వెయ్యి ఉద్యోగాలు ఇచ్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గోడం చందన్, నాయకులు, అభిమానులు తాటిపెల్లి రాజు, కృష్ణకుమార్, నాణం రమణ, తులసీరాం, పాండు, కృష్ణారావ్, దేవానంద్, శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మాజీ మంత్రి రామారావు జీవితం అందరికీ ఆదర్శం

బోథ్, జూలై 2: మాజీ మంత్రి స్వర్గీయ గోడెం రామారావు జీవితం నేటి తరానికి ఆదర్శమని ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేసిన ఈయన ఆదివాసీల అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశారన్నారు. మచ్చలేని మంత్రిగా పేరు గాంచిన రామారావు జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఆత్రం గంగాధర్, బండు మడవి, భీమావ్, దేవరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బోథ్, జూలై2: మండలంలోని కుసులాపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నయ్య (59) మద్యం మత్తులో పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బోథ్ ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నయ్య గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసగా మారాడని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే మద్యం మత్తులో పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే బోథ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఆదిలాబాద్ రూరల్, జూలై2: మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత సైతం తీసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రిమ్స్ వైద్య కళాశాల గృహ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున రిమ్స్ సిబ్బంది, వైద్య విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్, తిప్పస్వామి, సందీప్ పవర్, ఇద్రిస్ అక్బాని పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, వైద్యులు

వర్షాకాలం దృష్ట్యా

ముందస్తు చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా



గూగుల్ మీట్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 2: వర్షాకాలం దృష్ట్యా మూడునెలల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజార్షిషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, భారీ వర్షాలకు వరదలు రాకుండా ముందస్తు చర్యలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి తగు చర్యల నిమిత్తం ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, డీపీఓ, పోలీసు శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఏయే ప్రాంతాలలో జరిగిన సంఘటనలకు తావివ్వకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఎక్కడెక్కడ డ్యామేజ్ అయిన రోడ్లు, ఇళ్లు, గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. హాస్టల్‌లో పరిశుభ్రత పాటించడం, 312 హాబిటేషన్‌లో వర్షాకాలం ఇబ్బందులు ఎదురవుతున్న వాటిని గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలలో ముందుగానే మూడు నెలలకు సరిపడ సరుకులు, పౌష్టికాహారం సరఫరా చేసుకోవాలన్నారు.ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొత్తం 457 చెరువులు ఉన్నాయని, డెంజర్ జోన్‌లకు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్‌లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకు పోల్స్ రెడీగా ఉన్నాయన్నారు.వరదలు,విద్యుత్ ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, భారీ వర్షాల సమయంలో సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రహదారులపై ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి విపత్తుల నివారణకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇందులో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'కబ్జాకు గురవుతున్న గ్రామకంఠం భూమిని కాపాడండి'

బోథ్, జూలై2: మండలంలోని భాగ్యలతండా గ్రామం శివారులో ఉన్న 4ఎకరాల 7గుంటల గ్రామకంఠం భూమి ఆక్రమణకు గురవుతోందని, ఆ భూమిని కాపాడాలంటూ గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలోని సర్వేయర్‌కు సమస్యను విన్నవించారు. ఖాళీ స్థలం ఉండటం వల్ల సమీప గ్రామాల వారు కొందరు పశువుల పాకలను వేశారని, అయితే దాదాపు 10మంది ఈ భూమిని ఆక్రమించుకున్నారని, పశువుల పాకను తొలగించమంటే వారు ఒప్పుకోవడం లేదని, ఈ విషయంలో రెవెన్యూ శాఖ అధికారులు జోక్యం కల్పించుకుని కబ్జాదారుల నుంచి ఈ భూమిని కాపాడాలని వివరించారు. అయితే భవిష్యత్తులో తమ ప్రాంతంలో ప్రభుత్వ పరంగా మంజూరయ్యే ఆశ్రమ పాఠశాలలు గానీ, ఇతర పాఠశాలలు గానీ మంజూరుఅయితే ఈ భూమి వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. సమస్యను మండల సర్వేయర్‌కు వివరిస్తే తాము ఈ పరిస్థితిలో రాలేమని జనవరి, ఫిబ్రవరి నెలలో వస్తామని వివరించారని తెలిపారు. జిల్లా అధికారులు తగు చొరవ చూపించి గ్రామకంఠం భూమిని కాపాడాలని కోరారు.

'మార్కండేయ ఆలయానికి టెండర్లు పిలవాలి'

బోథ్, జూలై 2: వేములవాడలో గల దేవాదాయ శాఖ ఈఈ రాజేష్‌ను శివభక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు శివ మార్కండేయ ఆలయానికి టెండర్లను సకాలంలో పిలవాలని ఈఈని కోరారు. ఈ సందర్భంగా వారు మండలంలో పూర్తి అయిన ఆలయాలకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది పందరం శంకర్, భైరి రవి, తడక పోశెట్టి, తదితరులు ఉన్నారు.

బోరు బావిని ప్రారంభించిన ఎంపీపీ

బోథ్, జూలై 2: మండలంలోని సోనాల గ్రామంలో ఎంపీపీ నిధులతో నూతనంగా వేయించిన బోరు బావిని మండల అధ్యక్షుడు తుల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. నూతన కాలనీ వాసులు తీవ్రమైన మంచినీటి ఎద్దడిని ఎదుర్కోవడంతో సమస్యను ఎంపీపీ దృష్టికి తీసుకురాగా బోర్ బావిని తవ్వించి మోటార్ బిగించారు. దీంతో మంగళవారం కాలనీ వాసుల కోసం తవ్వించిన బోరు బావిని ప్రారంభించారు.

మాజీ ఎంపీ కుటుంబీకులకు నాయకుల పరామర్శ

ఉట్నూర్, జూలై2: మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మరణం పార్టీకి తీరని లోటు అని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర సంఘన మంత్రి చంద్రశేఖర్‌జి అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని రాథోడ్ రమేష్ నివాసానికి చేరుకుని రమేష్ రాథోడ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే సుమన్‌రాథోడ్, కుమారులు రాథోడ్ రితేష్, రాథోడ్ రాహుల్‌లను పరామర్శించి రాథోడ్‌రమేష్ మృతి గురించి వివరాలు తెలుసుకున్నారు. వారితోపాటు బీజేపీ రాష్ట్ర నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం తదితరులు ఉన్నారు.



రాథోడ్‌రమేష్ చిత్రపటం వద్ద నివాళులుర్పిస్తున్న చంద్రశేఖర్ జీ



బుక్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

డికోడబుల్ టెక్స్ బుక్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, జూలై2: ఒకటి రెండు తరగతుల కోసం "రూం టూ రీడ్ ఇండియా ట్రస్టు" రూపొందించిన డికోడబుల్ టెక్స్ బుక్‌ను జిల్లా కలెక్టర్ రాజార్షిషా మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రూం టూరీడ్ ఇండియా రాష్ట్ర మేనేజర్ నరసింహా చారి గత సంవత్సరంలో రూంటూ రీడ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాల నివేదికను అందజేశారు. వచ్చేనెలలో రూం టూ రీడ్ సంస్థ రూపొందించిన మోడల్ లైబ్రరీల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏఎంఓ శ్రీకాంత్‌గౌడ్, రూం టూ రీడ్ రాష్ట్ర ప్రతినిధి ఎస్.ప్రవీణ్, ప్రాజెక్టు అధికారి టి.నితిన్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్, జూలై2: ఆదిలాబాద్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న గల సర్ ప్లస్‌లో ఉన్న ఉపాధ్యాయులు సంబంధిత హెడ్మాస్టర్ అనుమతితో ఈనెల 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లో గణితం 1, ఫిజికల్ సైన్స్ 1, బయాలజికల్ సైన్స్ 1, సోషల్ 1, ఇంగ్లీష్ 1, హిందీ 1, తెలుగు 1 పోస్టు ఉన్నాయని తెలిపారు. ఎస్జీటీ రెండు, పీఈడీ 1 పోస్టు ఉందని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి



బాలికలతో మాట్లాడుతున్న పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జూలై2: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ ఆధ్వర్యంలోని మంచిర్యాల బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా పీవో మాట్లడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెను ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పాఠశాలల పరిసరాలలో వర్షపు నీరు నిలువ కుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించే విధానాన్ని పరిశీలించి ఇలా బోధించాలంటూ తాను టీచర్‌గా మారి బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుపై ప్రత్యేక మహాజన సభ

దిలావర్‌పూర్, జూలై 2 : రైతు బంధుపై రైతుల అభిప్రాయ సేకరణకు మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ... రైతుబంధు పంపిణీపై రైతులు నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలు వెల్లడించాలన్నారు. ఈ మహాజన సభలో 72 మంది రైతులు పాల్గొనగా 42 మంది రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. వీరిలో 5 ఎకరాల లోపు రైతులకు రైతుబంధు ఇవ్వాలని 12 మంది రైతులు, 10 ఎకరాల లోపు రైతులకు ఇవ్వాలని 16 మంది రైతులు, కౌలు రైతులకు కూడా ఇవ్వాలని 4 మంది రైతులు, సాగుభూమికి మాత్రమే ఇవ్వాలని 5 మంది రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, ప్రభుత్వ ఉద్యోగులకు, బీడు భూములకు, దేవాలయ భూములకు రైతు బంధు ఇవ్వకూడదని 15 మంది రైతులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి స్రవంతి, పీఏసీఎస్ సీఈవో సుకుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దిలావర్‌పూర్, జూలై 2 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ స్వాతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

'విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి'



దస్తురాబాద్, జూలై 2 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, వంట గదిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలన్నారు. పాఠశాల సరిసరాలను, తరగతి గదు లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రమేష్

దస్తురాబాద్, జూలై 2 : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మండల ఎంపీడీవో కే.రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని భూత్కూర్, అకొండపేట్ గ్రామాలలో డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మంచినీటిని వేడి చేసి గోరువెచ్చని నీరు త్రాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్, ఆశా కార్యకర్తలు గోదావరి, సుజాత, అంగన్‌వాడీలు రత్నమాల, సుగుణ దేవి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● బీజేవైఎం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్



ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

నిర్మల్‌టౌన్, జూలై 2 : తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్ డిమాండ్ చేశారు. నిర్మల్ ఎమ్మార్వో కార్యాలయంలో మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారనేది జగమెరిగిన సత్యం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుంది. ఈ మోసాలను ఎండగడుతూ తెలంగాణ యువత తరఫున, నిరుద్యోగుల తరఫున బీజేవైఎం గత కొన్ని సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఈ నియంతృత్వ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా కాలం గడిపేస్తుది. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రావణ్, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ గిల్లీ, కార్యదర్శి సోనునాయక్, చరణ్ మోర్య, సుంకరి సాయి, హరీష్, రాహుల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జైలుకు వెళ్లి వచ్చినా మారని బుద్ధి

● చోరీకి పాల్పడ్డ నిందితులను అరెస్టు చేసిన పోలీసులు ● 8 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 20వేల నగదు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు



మెట్‌పల్లిలోని సమావేశంలో వివరాలను తెలుపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూలై, 2 : మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడి తప్పించుకుంటూ తిరుగుతున్న పాత నేరస్తుల్ని పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు తెలిపారు. మంగవారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎసై అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా చెందిన మాదాపూర్ గ్రామస్థుడు దర్పల్లి సాయిలు, బాసరకు చెందిన కొసిడియా మోహన్ పలు చోరీ కేసుల్లో గతంలో జైలుకు వెళ్లి జూన్ 3న విడుదలై బయటకు వచ్చారు. దర్పల్లి సాయిలు చిన్నతనం నుంచి జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతుండేవాడు, భార్యను హింసించడంతో వదిలిపెట్టి పోయింది. అప్పటి నుంచి అతనిపై 20 చోరీ కేసులతో పాటు హైదరాబాద్‌లో మర్డర్ కేసులు కూడా ఉన్నాయి. కొసిడియా మోహన్‌పై 14 చోరీ కేసులు వివిధ పోలీసుస్టేషన్‌లో కేసులు ఉన్నాయి. మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన జోగిరిశంకర్ జూన్ 22 ఇంటికి తాళం వేసి షిరిడీయాత్రకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. జూన్ 24న రాత్రి సమయంలో దర్పల్లి సాయిలు, కొసిడియా మోహన్ తాళం పగ లగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 5తులాల బంగారు బిస్కెట్, తులం బంగారు చైను, 2 తులాల బంగారు తీగ, 10 తులాల వెండి కుడితో పాటు రూ. 1.50లక్షలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న జోగిరి శంకర్ తిరిగి ఇంటికి వచ్చి విషయాన్ని పోలీసులకు తెలపడంతో కేసు నమోదు చేశాడు. దీంతో క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో చుట్టు పక్కల ప్రదేశాలను సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌కుమార్ పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి సీఐ, ఎస్సైలు గాలింపు చర్యలు జరిపారు. ఈ క్రమంలో మంగళవారం గండి హనుమాన్ ఆలయం సమీపంలో దర్పల్లి సాయిలు, కొసిడియా మో హన్‌లు అనుమానస్పందంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మేడిపల్లిలో దొంగతనం చేసినట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు బైకులను దొంగిలించినట్లు అంగీకరించారు. వారి నుంచి చోరీ చేసిన బంగారం, వెండి నగలు, రూ. 20వేల నగదు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్, కానిస్టేబుల్ కిరణ్, సంతోష్, చైతన్య, మహేందర్‌లను డీఎస్పీ అభినందించారు.

రైతులు వ్యవసాయంతో పాటు ఇతర వాటిపై దృష్టి సారించాలి

కుంటాల, జూలై, 2: రైతులు వ్యవసాయంతో పాటు కోళ్లపెంపకం, చేపల పెంపకం, గొర్రెల పెంపకం తదితర వాటిపై దృష్టి సారించి మరింత లాభాలు అర్జించవచ్చని ఏడీఏ వీణ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాలలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సమీకృత వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. ఈ సమావేశం హైదరాబాద్‌లో ప్రొగ్రెసివ్ ఫార్మర్ మల్లికార్జున రెడ్డి, సుధాకర్ సైంటిస్ట్‌లచే రైతులకు పలు రకాల లాభాలు అర్జించే విధానాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, ఏఈవోలో ప్రగతి, మహేష్, శ్రీధర్, గణేష్‌తో పాటు రైతులు ఉన్నారు.

కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఐఈవో

ముథోల్, జూలై 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం నిర్మల్ జిల్లా డీఐఈవో పరశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులందరూ ప్రతిరోజు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని చెప్పారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కైసర్ పాషా, అధ్యాపకులు శ్రీనివాస్, గంగాధర్, ప్రశాంత్, రహమాన్, పద్మ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఆదివాసీ నాయకులు

దస్తురాబాద్, జూలై 2 : మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... భూమికోసం, భుక్తి కోసం అమరులైన ఆదివాసీల త్యాగానికి చిహ్నంగా నిర్మించ బడిన ఇంద్ర వెల్లి అమరవీరుల స్థూపం వద్ద కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మ కంగా అమరవీరుల స్మృతివనం ఏర్పాటుకు శంకుస్థాపన, భూమి పూజ చేయడం హర్షనీయమన్నారు. ఇంతటి గొప్ప కార్యానికి పూనుకున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్య క్షులు మెస్రం సురేందర్, ప్రధాన కార్యదర్శి తొడసం కిరణ్‌కుమార్, సహ కార్యదర్శి తొడసం రాజేందర్, ప్రచార కార్యదర్శి మాడవి మహేష్, చిత్రం మహేందర్, మెస్రం నరేష్, ఆడ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకమే మన భవిష్యత్తుకు రక్ష

లక్ష్మణచాంద, జూలై 2 : మొక్కల పెంపకమే మన భవిష్యత్తుకు రక్ష అని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ మంగళవారం అన్నారు. 'వన మహోత్సవం' కార్యక్రమం ద్వారా మండల కేంద్రంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇందులో భాగంగానే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీడీవో రాంప్రసాద్, ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ, ఈవోపీఆర్డీ నసిరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజ్, తాజా మాజీ సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, నాయకులు ఈటెల శ్రీనివాస్, ఐకేపీ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్ రాథోడ్ మరణం తీరని లోటు

● మాసాయిపేట్‌లో ఘనంగా నివాళులు

ఖానాపూర్, జూలై 2 : ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మరణం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం కడెం మండలంలోని మాసాయిపేట్‌లో రమేష్ రాథోడ్ సన్మాన సభను ఆయన అభిమానులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... ఎంపీగా, ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా రమేష్ రాథోడ్ జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొరిపెల్లి దినకర్‌రెడ్డి, వీడీసీ నాయకులు ఎస్కే హైమద్, ఎం. ప్రసాద్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు ఎం. రాము గౌడ్, రత్నాల పోషన్న, నేరెళ్ల రాజేశ్వర్, గ్రామ నాయకులు ఎట్టం ఎర్రన్న, దుర్గం పోషన్న, పి. రాజేందర్, ఉత్కం రాజేశ్వర్ గౌడ్, చాకలి గంగన్న, వెన్నం వెంకట రమణ, కుంటాల పెద్ద నర్సయ్య, నడ్పి నర్సయ్య, నిలీ అరవింద్, మూల శ్రీనివాస్, ఉత్కం వెంకటేష్ గౌడ్, బుర్ర గంగా గౌడ్, పోష గౌడ్, నరేష్ గడ్, లింగా గౌడ్, రాజేశ్వర్, సాయి కుమార్ గౌడ్, మూల రాజు గౌడ్, గొల్లపెల్లి రవి కుమార్, పంజాల నర్సయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 32.4 కనిష్టం 25.7



నిర్మల్
జిల్లా వార్తలు

8

బుధవారం 3 జూలై 2024

ముగిసిన ఎంపీపీ, జడ్పీ పాలన



- ఇక ప్రత్యేక అధికారుల ఆధీనంలోకి
- స్థానిక ఎన్నికలపై పార్టీల దృష్టి
- మారబోతున్న రాజకీయ సమీకరణలు
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రభావంపై చర్చ

నిర్మల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ, జడ్పీపాలనకు నేటితో తెర పడబోతోంది. ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్‌లు ఇక మాజీలు కాబోతున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి అప్పటి సర్కారు తీరుతో ఎంపీపీ, జడ్పీ పాలన అంతా అస్తవ్యస్తంగా సాగిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా నిధుల విడుదల విషయమై అప్పటి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం కనబర్చడంతో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారన్న అభిప్రాయాలున్నాయి. నిధుల విడుదల కోసం ఎంపీటీసీలు, జడ్పీటీసీలు చాలాసార్లు బహిరంగంగానే గళమెత్తి విఫలమయ్యారు. అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజారిటీ ఎంటీసీలు, జడ్పీటీసీలు సర్కారుపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. వీరంతా కేవలం పదవులకే పరిమితమైపోయారు. ఎలాంటి అధికారాలు లేని కారణంగా తమ తమ ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులతో సమఉజ్జీలు కాలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం ఎట్టకేలకు ముగిసింది. మరికొద్ది రోజుల్లోనే ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు జరిగే అవకాశాలున్న కారణంగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే ఆ దిశగా దృష్టి సారిస్తున్నాయి. గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల కాలం ముగిసి చాలా రోజులు అవుతున్నప్పటికీ ఆ పంచాయతీల ఎన్నికలను ప్రభుత్వం బీసీ జనాభా లెక్కల విషయమై వాయిదా వేసింది. అయితే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విషయంలో మాత్రం జాప్యం జరిగే అవకాశాలు లేవంటున్నారు. దీని కారణంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సమాయత్తమవుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గెలుపు ఊపుతో బీజేపీ దూకుడుగా ముందుకు వెళ్ళేందుకు సిద్ధమవుతుండగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కారణంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుపొంది ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి చతికిలపడిపోయిన బీఆర్ఎస్ పార్టీ కనీసం మెజార్టీ ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను గెలుచుకునేందుకు ఉవ్విళ్లూరుతోంది.



జిల్లా పరిషత్ కార్యాలయం ఇదే

దూకుడుతో బీజేపీ

ఇదిలా ఉండగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు సాధించడమే కాకుండా నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బీజేపీ పెద్ద మొత్తంలోనే ఓట్లను కైవసం చేసుకుంది. ప్రస్తుతం నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలుగా బీజేపీకి చెందిన మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్‌లు కొనసాగుతున్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఈ మూడు నియోజకవర్గాలకు గానూ బీజేపీ భారీ మెజార్టీ సాధించింది. ఈ ఊపుతోనే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తిరిగి గెలుపు సాధించాలని బీజేపీ వ్యూహరచన సాగిస్తోంది. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అత్యధిక ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ స్థానాలను దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేస్తున్నారు. మెజార్టీ ఎంపీపీలను, జడ్పీ చైర్మన్‌ల స్థానాలను ఈ సారి బీజేపీకి దక్కే విధంగా మహేశ్వర్ రెడ్డి పావులు కదుపుతున్నారు. పార్టీలో గ్రామస్థాయి నుంచి క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్తలకు ఈ సారి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించే దిశగా కూడా ఆయన యోచిస్తున్నారు. ముఖ్యంగా యూత్, మహిళలకు ఈ ఎన్నికల్లో అత్యధిక సీట్లను కేటాయించాలని బీజేపీ భావిస్తోంది.

అధికార ఊపుతో కాంగ్రెస్

కాగా రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కారణంగా ఆ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోబోతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కొంత మేరకు నష్టపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సహకారంతో సంక్షేమ అభివృద్ధి పథకాల పేరిట తిరిగి పట్టు నిలుపుకునే ప్రయత్నాలు మొదలుపెట్టింది. దీనికి వేదికగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను చేసుకోబోతోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావులతో పాటు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ తదితరులు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై ఇప్పటి నుంచే గురి పెడుతున్నారని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తదితరులు మండలాల వారిగా సీనియర్ నేతలతో సీరియస్‌గా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై మంతనాలు సాగించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అధికారంలో ఉన్న కారణంగా ఎలాగైనా మెజారిటీ ఎంపీపీ పదవులను, జడ్పీ చైర్మన్ పదవులను దక్కించుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకొని సీరియస్‌గా కసరత్తు మొదలుపెట్టిందని అంటున్నారు.

అస్థిత్వం కాపాడుకునే దిశగా బీఆర్ఎస్ పార్టీ

తమ అస్థిత్వాన్ని కాపాడుకునే దిశగా బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభావాన్ని చవిచూసిన ఆ పార్టీ ఇప్పట్లో కోలుకోవడం కష్టమేనన్న ప్రచార నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుంటోంది. కనీసస్థాయిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను దక్కించుకొని పరువు నిలుపుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తోంది. కాగా ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు చాలా మంది సీనియర్ నాయకులు వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నప్పటికి సాధ్యం కావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పూర్వవైభవం దేవుడెరుగు గాని కనీసస్థాయిలోనైనా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను దక్కించుకొని మనుగడపై కొనసాగుతున్న సందేహాలను తొలగించుకోవాలని ఆ పార్టీలో ఉన్న కొంతమంది సీనియర్‌లు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

హరిహర క్షేత్రంలో పంచామృతాభిషేకం



నిర్మల్ కల్చరల్, జూలై 2 : నిర్మల్‌లోని మల్లన్న గుట్ట హరిహర క్షేత్రంలోని గణపతి, సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ఉదయం పంచామృతాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల నర్సింగ్ హోమ్ డాక్టర్ రమేష్‌రెడ్డి ఈ సందర్భంగా కిలోవెండిని స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి, గురుస్వామి మూర్తి, కోశాధికారి సామల వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

అంగరంగ వైభవంగా కావడి పూజ



జిల్లా కేంద్రంలో విశ్వనాథ్‌పేట్‌లోని గిరిక్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కావడం పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కావడి పూజలు చేసి పంచామృతాభిషేకం, నక్షత్ర మహాహారతి తరువాత తీర్థ ప్రసాద వితరణ చేశారు. శనిగారపు చిన్నయ్య, దినేష్, నరేష్, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌కు చేరుకున్న పండరిపూర్ పాదయాత్ర



ముథోల్‌కు చేరిన పాదయాత్ర

ముథోల్, జూలై 2 : ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రం నుంచి జూన్ 27వ తేదీన బయలుదేరిన పండరిపూర్ పాదయాత్ర మంగళవారం జిల్లా లోని ముథోల్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర భక్తులు మాట్లాడుతూ... గత 18 సంవత్సరాల నుంచి బేల నుంచి మహారాష్ట్రలోని పండరీపూర్ వరకు ప్రతీ సంవత్సరం సుమారు 80 మంది భక్తులు పాదయాత్ర ద్వారా వచ్చి విఠలేశ్వరుడిని దర్శించుకుంటామని తెలిపారు. జూలై 27 నుంచి ప్రారంభమైన పాదయాత్ర జూలై 16 వరకు పాదయాత్ర పండరీపూర్‌కు జూలై 16న చేరుకుంటామని అన్నారు. పండరిపూర్‌లో గల చంద్రబాబు నదిలో పుణ్యస్నానం ఆచరించి విఠలేశ్వరుడిని దర్శించుకుంటామన్నారు. ఇలా చేయడం వల్ల సమాజంతో పాటు ప్రజలందరూ సుఖశాంతులతో ఉంటారని నమ్మకం తెలిపారు. భగవంతుడి కృప అందరిపై ఉండాలని, ఆయురారోగ్యాలతో అందరూ సంతోషంగా ఉండాలని మంచిభావనతో ఈ పాదయాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి : డీపీవో శ్రీనివాస్

కుంటాల, జూలై 2 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుంటాల మండల కేంద్రంలో ఆదర్శ మాడల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో కుంటాల శివారులో మొక్కలు నాటారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీవో రహీం, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ శ్రీకాంత్, పంచాయతీ సెక్రటరీ ఉన్నారు.

పరిమితికి మించి ప్రమాదకంగా ప్రయాణిస్తున్నారని

ఆర్టీసీ బస్సును అడ్డుకున్న పొన్కల్ గ్రామస్థులు



బస్సు ఆపి నిరసన వ్యక్తం చేస్తున్న పొన్కల్ గ్రామస్థులు

మామడ, జూలై 2 : బస్సులో పరిమితికి మించి ప్రతీరోజు ప్రమాదాల అంచున ప్రయాణం చేస్తుండడంతో భయం వేస్తుందని గ్రామస్థులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళ వారం మండలంలోని పొన్కల్ గ్రామంలో గ్రామస్థులు, విద్యార్థులు బస్సును నిలిపి వేసి ధర్నా చేశారు. మండలంలోనే అతిపెద్ద గ్రామమైన పొన్కల్ మీదుగా కమల్‌కోట్ వరకు ఒకే బస్సు ఐదు ట్రిప్పులు నడపడంతో గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రా మాలైన ఆదర్శనగర్, న్యూ టెంబరేని, పోతారం, అనంతోఎట్, బందల ఖానాపూర్, చందారం గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రతీ నిత్యం వివిధ పనుల నిమిత్తం నిర్మల్‌కు వెళ్తుంటారు. సరైన బస్సులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు డీఎంకు విన్నవించిన పెడచెవిన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. పరి మితికి మించి ప్రయాణం చేస్తుంటే ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని, సంఘటనలు జరగకముందే సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు ఇకనైనా స్పందించాలి

చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు, ప్రజలు నిత్యం నిర్మల్ పట్టణానికి అధికంగా వస్తుంటారు. కాబట్టి ఇకనైనా ఆర్టీసీ వారు అధిక ట్రిప్పులు నడిపి ప్రమాదాలు జరగకముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, విద్యార్థుల కోరిక మేరకు మరో ట్రిప్పు నడపాలని కోరుతున్నాము. లేనియెడల రోడ్లపై బైఠాయించి నిరసన తెలుపుతామన్నారు.

కోండ్ర భాగ్యలక్ష్మి రాజారెడ్డి, ఎంపీటీసీ, పొన్కల్

ఆరోగ్య కార్యక్రమ లక్ష్యాలు సాధించాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్



నిర్మల్ కల్చరల్, జూలై 2 జిల్లాలో ఆరోగ్య క్రమాలు సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని నివారణ, నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఉప వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, ఇంద్రిస్, నయనారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సౌమ్య, తదితర వైద్యులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జారి పడి ఒకరు మృతి

సారంగాపూర్, జూలై 2 : మండలంలోని కౌట్ల గ్రామానికి చెందిన కాసారం భీమన్న(50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కింద జారిపడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడెల్లి ఆలయం వద్ద గ్రామస్థులు పోచమ్మ పండగను చేయగా గ్రామస్థులతో ఆలయానికి వెళ్లాడు. దారిలో కంచెవేసిన అటవీప్రాంతం గుండా భీమన్న వెళ్తుండగా కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడెం ప్రాజెక్టు మరమ్మతులను పరిశీలించిన కలెక్టర్

- పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశం



కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఖానాపూర్, జూలై 2 : కడెం ప్రాజెక్టును మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద గేట్ల మరమ్మతు, ఇతర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆమె ఆదేశించారు. ఇప్పటికే వర్షాకాలం ఆరంభమైనందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు ఆపరేషన్ సిస్టంను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతీ రోజు ప్రాజెక్టు నీటిమట్టం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. అత్యాధునిక ప్రమాద హెచ్చరికల వ్యవస్థ ఉన్నందున నిరంతరం ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షిస్తూ సమీప గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, తదితరులున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలి

నిర్మల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అత్యవసర సేవల విభాగం, ల్యాబ్, డయాలసిస్ కేంద్రం, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలు, వయోవృద్ధుల ఫిజియోథెరపీ, ఆరోగ్యశ్రీ, జనరల్ వార్డులను పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సలకు సంబంధించి వివరాలను వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆసుపత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆరోగ్య మిత్ర సేవలు ప్రతి ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. వివిధ విభాగాలకు సంబంధించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలకు సంబంధించి సమాచారాన్ని డిజిటల్ డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు, మరుగుదొడ్లు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. చికిత్స కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వైద్యులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఫిజియోథెరపీ, క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణాలను పరిశీలించి వైద్యాధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకుడు డా. రవీందర్, వైద్యులు ప్రసాద్, శ్రీనివాస్, దరహాస, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

- అప్పుల కుంపటితో రాష్ట్రం దివాలా
- కేంద్రం సహకారం లేనిదే రాష్ట్ర అభివృద్ధి అసాధ్యం
- గుడంపల్లిలో రూ. 10 కోట్లతో నిర్మించే రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్, జూలై 2 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని న్యూలోలం, గుండంపల్లి గ్రామాల్లో పర్యటించారు. న్యూ లోలంలో వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం గుండంపల్లిలో రూ.10 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయగా దానికి కొనసాగింపుగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల పైనే ఆధారపడి పాలన కొనసాగిస్తోందన్నారు. బీఆర్ఎస్ వారసత్వాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తూ రాష్ట్రాన్ని అప్పుల కుంపటిలోకి నెడుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే కేంద్రప్రభుత్వ సహకారం లేనిదే రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అభివృద్ధి పనులు కొనసాగడం కష్టమేనన్నారు. ఎన్నికల్లో గెలువడం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ రాబోయే రోజుల్లో గడ్డు కాలం దాపురిస్తుందన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. నిర్మల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెస్తానన్నారు. నిర్మల్ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. చిన్నపాటి వర్షానికి ఇళ్లలో నీరు చేరడం చూస్తే అప్పటి ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. నిర్మల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించనున్నట్లు మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. 61వ జాతీయ రహదారి నుంచి గుండంపల్లి వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ. 10 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. గుండంపల్లి నుంచి దిలావర్‌పూర్ వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి మరో రూ. 10 కోట్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. గుండంపల్లిలో డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, పంచాయతీరాజ్ డీఈఈ రాజేందర్‌రావు, ఆర్ అండ్ బి డీఈఈ, తహసీల్దార్ స్వామి, ఎంపీడీవో అరుణ, ఎంపీవో అజీజ్ ఖాన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దివ్యరెడ్డి, ఏపీఎం సులోచన రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గుండంపల్లిలో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన

నిర్మల్ కల్చరల్ : నిర్మల్ నియోజకవర్గం సోన్ మండలంలోని మాదాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాలకు రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం శంఖు స్థాపన చేశారు. రూ. 14 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎమ్మె ల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీపీ మానస హరీష్‌రెడ్డి, నాయకులు సరికెల గంగన్న, మార గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన వన మహోత్సవంలో భాగంగా మాదాపూర్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

మామడ : మండలంలోని కమల్‌కోట్ గ్రామం నుంచి గుమ్మిర్యాల్ బ్రిడ్జి వరకు కోటి రూపాయలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం రోజున బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

సంక్షిప్త సమాచారం

డాక్టర్లకు సన్మానం



నిర్మల్ అర్బన్, జూలై 2 : ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ గోపాలకృష్ణ, శిశు వైద్యులు డాక్టర్ సంతోష్, ప్రసూతి వైద్యులు డాక్టర్ స్వర్ణ రెడ్డి, డాక్టర్ విద్యుల్లత, డాక్టర్ చంద్రిక, డాక్టర్ సరితలను కేక్ కట్ చేయించి పూలమాల, శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అన్సర్ పాషా, ఉపాధ్యక్షులు శోభారాణి, ప్రధాన కార్యదర్శి తుమ్మల దేవరావ్, సహాయ కార్యదర్శులు హరికృష్ణ, మురాద్ అఫ్రోజ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర నాయకుడికి సన్మానం



నిర్మల్ కల్చరల్, జూలై 2 : బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ నిర్మల్ రాక సందర్భంగా మంగళవారం జిల్లా నాయకులు శాలువాతో సన్మానించి సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి, అల్లాపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, కమల్ నయన్, సాధం అరవింద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన వైద్యాధికారి

నిర్మల్ కల్చరల్, జూలై 2 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ మంగళవారం మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించారు. భోజనం తయారీ, డార్మెటరీ, పరిసరాలు పరిశీలించి సూచనలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, భోజనాల సమయంలో చేతులు కడుక్కోవాలని సూచించారు. బారె రవీందర్, సంతోష్, సామాజిక ఆరోగ్య అధికారులు లక్ష్మీ, సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, జూలై 2 : ఉత్తమ ఉపాధ్యాయ జాతీయ పురస్కారానికి ఈ నెల 15లోగా వెబ్ పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసినవారు సరైన పత్రాలు వివరాలు డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

'పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి'

నిర్మల్ కల్చరల్, జూలై 2 : ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. డ్రై డేలో భాగంగా మంగళవారం తన నివాసంలో పరిసరాల్లోని పూలకుండీలో నిల్వ ఉన్న నీటిని తొలగించి పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రతి శుక్ర, మంగళవారాలు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు.